www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 6 ఆగస్టు 2023
5
ఏలూరు



నేడు ఏలూరులో గవర్నర్ పర్యటన



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ ఈనెల ఆరో తేదీన ఏలూరులో పర్యటించనున్నారు. ఉదయం 9.45 గంటలకు రాజ్‌భవన్ నుంచి భయలుదేరి రోడ్డుమార్గం గుండా 10.50 గంటలకు ఏలూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. 10.50 గంటల నుంచి 11.30 గంటల వరకూ అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కార్యక్రమంలో పాల్గొంటారు. 11.30 గంటలకు తిరిగి ఏలూరు నుంచి రోడ్డుమార్గాన 12.30 గంటలకు విజయవాడలోని రాజ్‌భవన్‌కు చేరుకుంటారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు

- 'పోలవరం నిర్వాసితుల సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధుల గళం
- డ్రెయినేజీ, తాగునీరు, ఉపాధి, భూమికిభూమి వంటి సమస్యలెన్నో అంటూ ఆవేదన
- వేలేరుపాడు ఆసుపత్రిలో సదుపాయాల్లేక గర్భిణుల అవస్థలు
- ఉమ్మడి జిల్లా జెడ్‌పి సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు
- వ్యవసాయం, విద్య, ఇరిగేషన్, ఇళ్ల నిర్మాణం వంటి సమస్యలపై ఏకరువు



ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశంలో పాల్గొన్న జెడ్‌పి చైర్మన్, రెండు జిల్లాల కలెక్టర్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితులను తరలించిన జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ, ఉపాధి లేక, భూమికి భూమి ఇవ్వక అక్కడికి చేరిన నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఆయా ప్రాంతాలకు చెందిన జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు ఉమ్మడి జిల్లాపరిషత్ సమావేశంలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశపు హాలులో శనివారం జరిగిన జెడ్‌పి సర్వసభ్య సమావేశం జెడ్‌పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పోలవరం మండలానికి చెందిన జెడ్‌పిటిసి, ఎంపిపి, వేలేరుపాడు మండలానికి చెందిన ఎంపిపి, జెడ్‌పిటిసిలు పోలవరం నిర్వాసితులు పడుతున్న ఇబ్బందులు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని సమస్యలపై గళమెత్తారు. పోలవరం మండలానికి చెందిన శివగిరి, కొరుటూరు నిర్వాసితులను తరలించిన కాలనీలో కనీస వసతులు లేవన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ చేరిన నిర్వాసితుల సమస్యలపై జిల్లాకలెక్టర్ అధ్యర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మండలకేంద్ర పోలవరంలో నిర్మిస్తున్న ఆసుపత్రి పూర్తికాలేదన్నారు. పోలవరం నియోజకవర్గంలో ఇళ్లనిర్మాణాలకు అవకాశం లేకుండా చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. వేలేరుపాడులో ఉన్న ఆసుపత్రిలో సరైన ఆసుపత్రికక గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటీవల ఓ గర్భిణీ ఉదయం నుంచి రాత్రి వరకూ నొప్పులతో బాధపడుతూనే ఉన్నారన్నారు. ఆసుపత్రిలో సదుపాయాలు కల్పించాలని కోరారు. ఏజెన్సీలో రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్లు వేయాలన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించిన పరిహారం ఇవ్వకపోవడం తీవ్ర సమస్యగా ఉందన్నారు. అధికారులు జెడ్‌పిటిసి సభ్యులను కనీసం పట్టించుకోవడం లేదని తెలిపారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానం ఇస్తూ ఐటిడిఎ పిఒ బాధ్యతలు తీసుకున్నారని, కొద్దిరోజుల్లో నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. లేవనెత్తిన సమస్యలపై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. నాడు - నేడు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సంబంధించిన బకాయిలు, ఇళ్ల నిర్మాణాల పెండింగ్ బకాయిలు, జలశక్తి, రోడ్లు, ఇరిగేషన్, వ్యవసాయం, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన పలు సమస్యలను సభ్యులు లేవనెత్తారు.

పనుల్లో జెడ్‌పిటిసి సభ్యులకు ప్రాధాన్యత : జెడ్‌పి చైర్‌పర్సన్

జిల్లా పరిషత్ నిధులతో మండల పరిధిలో చేపట్టే పనుల్లో జెడ్‌పిటిసి సభ్యుల సూచనలకు ప్రాధాన్యతనిస్తామని జెడ్‌పి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జెడ్‌పిటిసి సభ్యులు తమ పరిధిలోని గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, వాటికి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారుల ద్వారా చర్యలు తీసుకున్నారు. పద్మశ్రీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంతో జిల్లా పరిషత్ ద్వారా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రతీ ఇంటికి జల జీవన్ మిషన్ ద్వారా తాగునీటి కుళాయి కనెక్షన్లు అందిస్తున్నామన్నారు. సత్యసాయి తాగునీటి పథకం ద్వారా జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లోని 151 గ్రామాల ప్రజలకు తాగునీరు అందించామన్నారు. నవరత్నాల్లో భాగంగా గృహ నిర్మాణ పథకాన్ని పూర్తిగా అమలు చేసి రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని గ్రామాల్లో పూర్తి పారిశుద్ధ్య పరిస్థితులు ఉండేలా చూడాలని, దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు. వరదల కారణంగా పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నది అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తుందని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయిని మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆచంట శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ ఇటీవల వరద ముంపునకు గురైన ప్రాంతాల్లోని ప్రజలకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారని, వరద బాధితులకు అండగా నిలిచి, వారికి అసౌకర్యం కలగకుండా వరద సహాయక చర్యలు చేశారన్నారు. జిల్లా పరిషత్ ద్వారా నిధుల కేటాయింపును అన్ని మండలాలకు సమానంగా కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పోలవరం నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్‌కాలనీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు వంటివి వాటికి జెడ్‌పి నిధులు కేటాయించాలన్నారు. శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఎంపిటిసిలకు గౌరవ వేతనం పెంచాలని కోరారు. ఉణుకు మండలం దువ్వ గ్రామంలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలని కోరారు. ఉణుకు, పెరవలి మండలాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మించాలని కోరారు. పెరవలి మండలం మల్లేశ్వరంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు దాతలు స్థలం అందించారని, ఆ ప్రదేశంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ నంబూరి తేజ్ భరత్, ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు, జిల్లా పరిషత్ సిఇఒ కె.రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ శ్రీనివాస్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కొల్లేరులో లైడార్ విధానంలో భూసర్వే

కొల్లేరు కాంటూరు పరిధిలో లైడార్ విధానం ద్వారా భూముల రీ సర్వే చేస్తున్నట్లు ఏలూరు జిల్లాకలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కార్యక్రమంలో చేపట్టిన నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బందాలు పనుల నాణ్యతను పరిశీలిస్తున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల కాలనీల్లో విద్య, వైద్యానికి సంబంధించిన సదుపాయాలతోపాటు, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పిస్తామన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

-ఇళ్ల వెంకటేశ్వరరావు, ఎంఎల్‌సి

పంచాయతీ రాజ్‌లో సుమారు 470 మంది అటెండర్లు, స్వీపర్లు, ట్యాంక్ వాచ్‌మెన్, తదితర ఉద్యోగులకు 2010 నుండి పిఆర్‌సిలు వర్తింపచేయలేదని, 20 నెలల డిఎ ఇవ్వలేదన్నారు. ఆ బకాయిలు చెల్లించాలని కోరారు. హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఫేజ్2 విద్యకు సంబంధించి బోధనా సిబ్బందిని నియమించినట్లు విచారిలో చ్చారని, విద్యార్థుల సంఖ్య మాత్రం తక్కువగా ఉందన్నారు. ఫేజ్‌టు విద్య బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు.



పోరు యాత్రలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

ఏలూరుకు ఐద్వా పోరుయాత్ర

మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి : ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి



సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.సత్యవతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని కోరుతూ ఐద్వా చేపట్టిన రాష్ట్ర పోరుయాత్ర శనివారం ఉదయం ఏలూరు నగరంలో ప్రవేశించింది. ఈ సందర్భంగా స్థానిక తంగెళ్లమూడి వంతెన వద్ద పెద్దఎత్తున మహిళలు, ప్రజాసంఘాల నాయకులు బృందానికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఏలూరు 29వ డివిజన్ కుమ్మరి రేవులో మహిళలతో ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూ దేశంలో మహిళలు, చిన్నారులపై రోజురోజుకీ పెరుగుతున్న హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులను అరికట్టాలన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై 25 శాతం లైంగిక వేధింపులు దాడులు పెరిగాయని, దీనికి కారణం బిజెపి దానిని నడిపిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సంస్థలేనన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ల పురుషాధిక్య భావజాలమే మహిళలపై హింస, లైంగిక వేధింపులు పెరగడానికి కారణవుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు గాళ్ల శారద, పి.వెంకటరమణ, చింతాడ వెంకటలక్ష్మి, జె.హరీష్ దుర్గ, ఎం.వెంకటలక్ష్మి, రజని, కనకదుర్గ, ఆందోళమ్మ పాల్గొన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రచార యాత్రకు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, సిఐటియు, కెవిపిఎస్, జన విజ్ఞాన వేదిక, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి.

దాడుల నిరోధానికి నిపుణుల కమిటీ వేయాలి

మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న హింసపై ఐద్వా చేపట్టిన రాష్ట్ర పోరుయాత్ర శనివారం ఏలూరు చేరుకుంది. ఈ సందర్భంగా ఏలూరులోని సిఆర్‌ఆర్ ఫార్మసీ వైద్య విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పురుషులు, మహిళల సమానత్వమనే ఆలోచనలు పెంపొందించుకోవాలన్నారు. మహిళలపై దాడులను అరికట్టడానికి అనేక చట్టాలున్నాయని, కానీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. దీంతో నిత్యం ఏదో ఒక చోట మహిళలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. బాలబాలికలు సమాజంలో లింగ అసమానతలు వీడి సమానత్వ భావన పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమాజచరిత్రను పరిశీలిస్తే ఒకప్పుడు మహిళలు చదువుకోవడానికి కూడా వీలు ఉండేది కాదన్నారు. సావిత్రిబాయి పూలే తొలి విద్యార్థిగా, తొలి ఉపాధ్యాయురాలిగా పేరొందారని తెలిపారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో ప్రారంభంలో మహిళలకు ఓటు హక్కు ఉండేది కాదని తెలిపారు. వీటిపై రాజా రామ్మోహన్ రాయ్, జ్యోతిరావు పూలే, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు వంటి అనేక సంఘసంస్కర్తలు, మహిళలు పోరాటాలు చేయడం ద్వారా మహిళలకు సమాన అవకాశాలను కల్పిస్తూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మన ముందుకు వచ్చిందని తెలిపారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై కూడా నిర్భయ ఘటన, దిశా వంటి ఘటనల్లో పౌర సమాజం మొత్తం రోడ్డు మీదకు వచ్చి ఉద్యమాలు చేయడం ద్వారానే నిర్భయ, దిశ వంటి చట్టాలు ప్రభుత్వాలు చేశాయని తెలిపారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి దేశమంతా మహిళలపై, చిన్నారులపై లైంగిక వేధింపులు అత్యాచారాలు దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా బిజెపి అధికారంలో ఉన్న మణిపూర్ రాష్ట్రంలో ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. దీనిపై ఆ రాష్ట్ర సిఎం బీరియన్ సింగ్, ప్రధాని మోడీ స్పందించిన తీరు దేశం సిగ్గుపడేలా ఉందన్నారు. ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి, ఐద్వా జిల్లా నాయకులు హరీష దుర్గ, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం నాయకులు గాళ్ల శారద మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులు మన ఏలూరులో ఎదుర్కొన్నామన్నారు. ఏడేళ్ల చిన్నారిపై మాదేపల్లి ఇందిరమ్మ కాలనీలో అత్యాచారం చేసి చంపిన ఘటన, ఇటీవల ఒక ప్రయివేట్ మెడికల్ ఉద్యోగిపై యాసిడ్ పోసిన ఘటన మహిళలపై దాడులను తెలియజేస్తున్నాయన్నారు. ఈ సదస్సులో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నరేంద్రబాబు, కళాశాల కరస్పాండెంట్ రాజా రామ్మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

8న విజయవాడలో ముగింపు సభ

అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూ చిన్నారులపై హింస, లైంగిక దాడులు, అత్యాచారాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ఈ నేపథ్యంలో పోరుయాత్ర చేపట్టామని తెలిపారు. ఈ యాత్ర గత నెల 28వ తేదీ నుండి రాష్ట్రంలో రెండు బృందాలుగా పర్యటిస్తుందని, ఒకటి శ్రీకాకుళం నుండి, రెండు హిందూపురం నుండి కొనసాగుతున్నాయని తెలిపారు. ఇవి ముగింపు రోజు ఈనెల ఎనిమిదో తేదీన విజయవాడ చేరుకుంటాయన్నారు. ఎనిమిదో తేదీన జింఖానా గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభకు ఐద్వా జాతీయ నాయకులు బృందాకరత్ హాజరవుతారని, పెద్దఎత్తున మహిళలు విద్యార్థినులు, ప్రజాసంఘాల నేతలు హాజరుకావాలని విజ్ఞప్తిచేశారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు ఏకమై పేదలకు అన్యాయం

రెండో రోజు 'భూమికోసం సమరశంఖారావం పాదయాత్ర'లో నేతలు



పాదయాత్ర చేస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం: పేదల భూములను భూస్వాములకు కట్టబెట్టే విధంగా చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల ఎంఎల్ఎలు ఉన్నమట్ల ఎలిజా, తెల్లం బాలరాజు ఎర్రకాలు ఇరిగేషన్ అధికారులతో కుమ్మక్కయ్యారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ విమర్శించింది. శనివారం జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరంలో ప్రారంభమైన భూమికోసం సమరశంఖారావం పాదయాత్ర తాడువాయి, వేగవరం, మైసన్నగూడెం, పట్టెన్నపాలెం గ్రామాల మీదగా సాగింది. ఈ సందర్భంగా పాదయాత్ర దళ నాయకులు, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు పంచాలని ఎనిమిదేళ్లుగా గిరిజనులు, దళితులు, పేదలు పోరాడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. స్థానిక ఎంఎల్ఎలకు పదేపదే ఈ సమస్య పరిష్కరించాలని భూమి లేని పేదలకు సాగుకు అవకాశం కల్పించాలని కోరినప్పటికీ పట్టించుకోలేదన్నారు. స్థానిక ఎంపీ కోటగిరి శ్రీధర్ సహకారంతో భూస్వాములు పను కట్టి పేదల భూములను ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు భూ పంపిణీ చేస్తామని చెబుతూ మరోపక్క భూములు అడుగుతున్న దళిత, గిరిజనులపై అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. ఎ.పోలవరం, చిన్న వారిగూడెం, తాడువాయి, మైసన్నగూడెం, పట్టెన్నపాలెం గ్రామాల్లోని అసైన్డ్, సీలింగ్ భూములను పోరంబోకు భూములను భూస్వాములు ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోగా వారికి స్థానిక ఎంఎల్ఎలు వత్తాసుపలుకుతున్నారని మండిపడ్డారు. రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు పేదలు, గిరిజనులు దళితుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. టి.నరసాపురం మండలంలో రామమ్మగూడెం గిరిజనులు 35 ఏళ్ల నుండి మంగళమెట్ట భూములను సాగు చేసుకుంటుంటే వారిపై పోలీసు అధికారులు దురుసుగా వ్యవహరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కృష్ణాపురం మెట్టలో గత 15 ఏళ్ల నుండి పేదలు, దళితులు, గిరిజనులు ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారని, ఆ భూములపై స్థానిక అధికార పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారులు, భూస్వాములకు కట్టబెట్టేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. చట్ట ప్రకారం పేదలకు భూములు ఇవ్వాలని లేనిపక్షంలో ఈనెల 8న ఆర్‌డిఒ ఆఫీస్ వద్ద ధర్నాలో అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా నాయకులు తామా ముత్యాలమ్మ, అందుగుల ప్రభాకర్, మడకం సుధారాణి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, నాయకులు సుబ్బారావు, కుమారి, రుక్మిణి పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల ఆర్డినెన్స్ రద్దు చేయాలి : వ్యకాస



రాస్తారోకో చేస్తున్న నాయకులు, మహిళలు

జంగారెడ్డిగూడెం :రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూముల ఆర్డినెన్స్ వల్ల పేదలకు, గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. మండలంలోని తాడువాయిలో జాతీయ రహదారిపై రాస్తారోకో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలు, దళితులు, గిరిజనుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పేదల జీవనవిధానం దెబ్బతీసే విధంగా అసైన్డ్ భూముల ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత, గిరిజన ఓట్లతో గెలిచి నేడు పేదల భూములను భూస్వాములకు కట్టబెట్టే విధంగా ఆర్డినెన్స్ తీసుకొచ్చిందన్నారు. దీనివల్ల లక్షలాది మంది పేదల కుటుంబాలు రోడ్డునపడే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో పేదలకు భూ పంపిణీ పేరుతో పేదల ఉసురును జగన్ ప్రభుత్వం తీస్తుందన్నారు. కాకులను కొట్టి గద్దలకు పెట్టే విధంగా ఆర్డినెన్సును ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అసైన్డ్ కమిటీలను బలపరిచి 9/77 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, భూమిలేని పేదలకు అసైన్డ్ చట్టప్రకారం రెండు ఎకరాల భూమి పంపిణీ చేయాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు దేవరత్నం, జిల్లా ఉపాధ్యక్షులు తామ ముత్యాలమ్మ, సహాయ కార్యదర్శి మడకం సుధారాణి, జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్, జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, వ్యకాస నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అస్వస్థతకు గురైన క్రీడాకారులు

80 మంది క్రీడాకారులకు అస్వస్థత

ఏలూరు స్పోర్ట్స్: పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో క్రికెట్ సెలక్షన్లకు వచ్చిన క్రీడాకారులు ఆదివారం రాత్రినుంచి ఒక్కక్కరుగా అస్వస్థతకు గురయ్యారు. వారికి వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి రావడంతో అందరూ ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి నవోదయ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్ఎన్.చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల మూడో తేదీ నుంచి ఆరో తేదీ వరకూ నవోదయ విద్యాలయలో జరగనున్న క్రికెట్ రీజనల్ మీట్‌కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్నాటక రాష్ట్రాల నుంచి 194 క్రికెట్ క్రీడాకారులు హాజరయ్యారు. వీరంతా మూడో తేదీ మధ్యాహ్నానికి నవోదయ విద్యాలయానికి చేరుకున్నారు. మరుసటి రోజు మధ్యాహ్నం వెజటబుల్ బిర్యానీ పెట్టారు. అది తిన్న అనంతరం సాయంత్రానికి పలువురు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో అస్వస్థతకు గురయ్యాయరు. వెంటనే అక్కడే ఉన్న మెడికల్ క్యాంప్‌లో వైద్యం అందించారు. తొలుత 30 మంది అస్వస్థతకు గురయ్యారు. ఉదయానికి వీరి సంఖ్య 80 మందికి చేరింది. దీంతో వెంటనే వారిని ప్రత్యేక 108 అంబులెన్సులను ఏర్పాటు చేసిన ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫుడ్ పాయిజన్ వల్లే అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. వీరిని దెందులూరు ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి మేరీ ప్రశాంతి, జెడ్‌పి చైర్మన్ గంటా పద్మశ్రీ ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం రాత్రికి వీరి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో డిశ్చార్జి చేశారు.

ఏలూరు అర్బన్ : పెదవేగిలోని జవహర్ నవోదయలో క్రీడాకారులు ఫుడ్ పాయిజన్‌కు గురవడం బాధాకరమని, వారికి మెరుగైన వైద్య సదుపాయాలు అందించి విద్యార్థులందరినీ క్షేమంగా స్వగృహాలకు పంపించాలని అఖిలపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం కాంగ్రెస్, సిపిఎం, జనసేన, సిపిఐ, ఎంఎల్ న్యూ డెమోక్రసీ, సిపిఐ, ఆమ్ ఆద్మీ, బిఎస్‌పి తదితర పార్టీల నాయకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రీడాకారులను పరామర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావువు, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నగర నాయకులు బద్ధ వెంకట్రావు, జనసేన నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్ జనసేన జిల్లా కార్యదర్శి కె తేజస్విని, ఆమ్ ఆద్మీ నాయకులు షేక్ మస్తాన్ వలి, బిఎస్‌పి నాయకులు కె.అంబేద్కర్, కెవిపిఎస్ నాయకులు బాలరాజు మాట్లాడారు.

రేపు కుక్కునూరు మండలంలో సిఎం పర్యటన ?

ఏలూరు ప్రతినిధి: సిఎం జగన్ ఈనెల ఏడో తేదీన ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం గ్రామంలో పర్యటించనున్నట్లు తెలిసింది. సిఎం పర్యటనపై అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. ఉదయం తూర్పుగోదావరి జిల్లా కోనసీమ ప్రాంతంలో వరద బాధితులను పరామర్శించి మధ్యాహ్నం నుంచి కుక్కునూరు మండలం రానున్నట్లు సమాచారం. ఈ జిల్లాలో ఉదయం పర్యటిస్తే మధ్యాహ్నం నుంచి తూర్పుగోదావరి జిల్లా వెళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు. సిఎం పర్యటనకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారం ఆదివారం వెల్లడికానుంది.

7న పోలవరంలో చంద్రబాబు పర్యటన

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల ఏడో తేదీన పోలవరంలో పర్యటించనున్నారు. అందుకు సంబంధించిన పర్యటన షెడ్యూల్‌ను విడుదలచేశారు. ఏడో తేదీ ఉదయం పది గంటలకు ఏలూరు మినీబైపాస్‌లోని క్రాంతి ఫంక్షన్‌హాలుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 12.30 గంటలకు పోలవరం మండలం పట్టిసీమ గ్రామంలోని యామిని ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటారు. తాళ్లపూడి, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పరిశీలిస్తారు. 12.30 నుంచి 1.30 గంటల వరకూ కార్యకర్తలతో సమావేశం ఉంటుంది. రెండుగంటలకు భయలుదేరి మూడు గంటలకు పోలవరం ప్రాజెక్టుకు చేరుకుంటారు. మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకూ పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారు. నాలుగు గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 5.30 గంటలకు దేవరపల్లి గ్రామంలోని డైమండ్ సర్కిల్‌కు చేరుకుంటారు. అక్కడ రోడ్‌షో నిర్వహిస్తారు. 6.30 నుంచి 7.30 గంటల వరకూ బహిరంగసభలో పాల్గొంటారు. 8.30 గంటలకు రాజమండ్రి బివిఆర్ ఫంక్షన్ హాలుకు చేరుకుంటారు.

అన్నీ తెలిసినా.. ఎందుకింత అలసత్వం..!



'గోదావరి వరదలు పూర్తిగా తగ్గి పూర్వస్థితి వచ్చే వరకూ పునరావాస కేంద్రాలు కొనసాగించండి.. ప్రతి వరద బాధితునికీ ప్రభుత్వసాయం కచ్చితంగా అందించండి.. మానవతా దృక్పథంతో ప్రతిఒక్కరినీ ఆదుకోండి' ఇదీ జిల్లా కలెక్టర్లకు సిఎం జగన్ చేసిన దిశానిర్దేశం.. సిఎం మాటలు విని వరద బాధితులకు ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తుందనుకుంటే పప్పులో కాలేసినట్లేనని గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు పెదవివిరుస్తున్నారు. అసలు ముంపు సమస్యను సృష్టించిందే ఈ పాలకులని, మళ్లీ ఆ సమస్య వల్ల బాధపడుతున్న తమను ఆదుకోకపోగా మొసలి కన్నీరు కార్చడం ఏమిటో తమకు అర్థం కావడం లేదని పోలవరం నిర్వాసితులు తలలు పట్టుకుంటున్నారు.

సుమారు పది రోజులపాటు వణికించిన గోదావరి వరద తగ్గింది. గతేడాదితో పోలిస్తే ఈసారి వరద ఉధృతి తక్కువగానే ఉన్నా నష్టం మాత్రం అదే విధంగా ఉందని ముంపు మండలాల ప్రజలు వాపోతున్నారు. గతంలో మాదిరి ఇళ్లను వదిలి కట్టుబట్టలతో పునరావాస కేంద్రాలకు, సమీపంలోని కొండలు, గుట్టలపైకి తరలివెళ్లి తలదాచుకున్న సంఘటనలు మళ్లీ మన ముందు సాక్షాత్కరించాయి. గతేడాది వరదలకు నష్టపోయి ఇప్పటికీ పరిహారం అందక, ఆ సందర్భంగా సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు కాక తీవ్ర అసంతృప్తితో ఉన్న ప్రజలకు ఈ వరదలు గోరుచుట్టుపై రోకలి పోటులా పరిణమించాయి. దీంతో బాధితుల పరామర్శకు వెళ్లిన పోలవరం ఎంఎల్‌ఎ బాలరాజును రెండుసార్లు నిర్వాసితులు నిలదీశారు. 'ముంపు తీసుకొచ్చిందే మీరు.. ఆ ముంపు నుంచి మమ్మల్ని బయటపడేసేలా పునరావాస పరిహారం, ప్యాకేజీ ఇస్తే తామే వెళ్లిపోతాం.. అంతేగాని ప్రతియేటా గోదావరి వరదలకు వచ్చి తమ కష్టాలు చూసి మొసలి కన్నీరు కార్చాల్సిన అవసరం లేదు' అంటూ కుండబద్దలు కొట్టినట్లు తేల్చిచెప్పారు. వరదల సందర్భంగా ఇస్తామన్న నష్టపరిహారం ఏమైందని నిలదీశారు. తమకు ఆ నష్టపరిహారం ఇచ్చినా.. ఇవ్వకపోయినా పునరావాస పరిహారం, ప్యాకేజీ ఇస్తే వెంటనే పునరావాస కాలనీలకు వెళ్లిపోతామని, అంతేగాని పొమ్మనలేక పొగబెట్టినట్లు ప్రతియేటా తమను ముంచుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని, వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వాన్ని గోదాట్లో ముంచుతామని హెచ్చరించారు. దీంతో కంగుతిన్న ఎంఎల్‌ఎ బాలరాజు ఈ సమస్యలేవీ తన దృష్టిలో ఇప్పటి వరకూ లేనట్లు ప్రజల ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ప్రకటించి అక్కడి నుంచి జారుకున్నారు. ప్రభుత్వ ఉదార ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో ఆచరణకు ఏమాత్రం పొంతన లేదనేది వాస్తవం. దీనికితోడు ఇటీవల పోలవరం పోరుకేక పేరిట సిపిఎం నిర్వహించిన పాదయాత్ర నిర్వాసితుల్లో ఆలోచన రేకెత్తించిందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అందుకే ప్రభుత్వ పెద్దల జాలి మాటలు.. అధికారుల ఊరడింపులకు తలొగ్గకుండా నిలదీసే పని ప్రారంభించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులకు సంబంధించిన పరిహారం, ప్యాకేజీకి సంబంధించిన నిధులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని నిలదీయకపోతే నిర్వాసితుల ఆగ్రహానికి గురయ్యేది మొదట రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వమేనని ఆ ప్రభుత్వ పెద్దలు గుర్తించడం మంచిదని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. దీనికితోడు కాంటూరు లెక్కల్లో లోపాలు, లైడార్ సర్వేలో తప్పిదాలను సవరించి 1986లో వచ్చిన వరదలు, 2022లో వచ్చిన వరదల ముంపు ఆధారంగా మండలం యూనిట్‌గా ప్రాజెక్టు ముంపును గుర్తిస్తే చాలావరకూ సమస్యలు పరిష్కారమవుతాయని, ఆపై వారికి పరిహారం, ప్యాకేజీ ఇస్తే నిర్వాసితులకు న్యాయం చేసినట్లని చెబుతున్నారు. ఇక వరదలకు సంబంధించి పంట నష్టం ఊసు పెద్దగా ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు సైతం ఎత్తడం లేదు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలతోపాటు పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట, యలమంచిలి మండలాల్లో కూరగాయ పంటలతోపాటు తమలపాకు తోటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదం నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం కొలమానాలు మాని క్షేత్రస్థాయిలో నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి మానవతా దృక్పథంతో ఆదుకోవాలని లంక గ్రామాల రైతులు కోరుతున్నారు. అలాగే గతంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా గోదావరిపై వంతెనలు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేగాని అన్నీ తెలిసినా ఏమీ పట్టనట్లు తూతూమంత్రంగా పర్యటనలు చేసి అరకొరగా నష్టపరిహారం విదిల్చితే ఏమీ ఉపయోగం ఉండదని, ప్రభుత్వం అలసత్వం వీడి వరద బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకుంటేనే వచ్చే ఎన్నికల్లో అధికారపక్షానికి నష్టం వాటిల్లకుండా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరి ప్రభుత్వం ఎప్పట్లానే మాటలు, ప్రకటనలతోనే కాలక్షేపం చేస్తుందో.. మాటల్లోని మానవతా దృక్పథాన్ని చేతల్లో చూపించి ప్రజల పక్షం వహిస్తుందో వేచిచూడాలి.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్


నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నేతలు..

'వైసిపికి బుద్ధి చెప్పాలి'

చింతలపూడి: వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని టిడిపి మహిళా ప్రధాన కార్యదర్శి యర్రా లీలా ప్రశాంతి అన్నారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుపై వైసిపి రౌడీ మూకలు రాళ్ల దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం రాష్ట్రవ్యాప్త "సాగునీటి ప్రాజెక్టుల విధ్వంస పోరుబాట" పరిశీలనలో భాగంగా పుంగనూరు నియోజకవర్గంలో పర్యటిస్తున్న టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుపై రౌడీ మూకలు రాళ్ల దాడి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిగజారుడు తనానికి, వైసిపి అరాచక పాలనకు నిదర్శనమన్నారు.

హామీలు అమలు చేయాలి

నిడమర్రు: వైసిపి ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివిఆర్ఎ, గ్రామ రెవిన్యూ, గ్రామ సహాయకుల, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వైసిపి విస్మరించిందన్నారు. శనివారం నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయంలో సుంకెట్ మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమణారావు మాట్లాడారు. ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో వివిఆర్ఎ, గ్రామ రెవిన్యూ సహాయకులకు డిఎ, టిఎ బిల్లులు నేటి వరకూ చెల్లించలేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఆగస్టు 7, 8 తేదీలలో సామూహిక నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాలు జరుగుతాయని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సమస్యల పరిష్కారం డిమాండ్లను వినతిని అందించారు.

బాధిత కుటుంబానికి టిడిపి సాయం

పోలవరం: ఎల్లండిపేట గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి చిక్కాల వీర్రాజు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన దగ్ధమైంది. ఇంటిని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పరిశీలించి, బాధిత కుటుంబానికి రూ.3 వేలు ఆర్థిక సహాయం, 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు అందించారు. తమకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. బొరగం శ్రీనివాసులు వెంట గ్రామ పార్టీ అధ్యక్షులు ఇళ్ల సత్యనారాయణ, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు గుబ్బ రాంబాబు, ఇళ్ల చిన్న సత్యనారాయణ, దార వెంకటేష్, చిక్కాల మురళీ, సంసాని గణేష్, జనపతి అజయ్, మద్ది అశోక్, మైనం రాంబాబు, దాసరి రవి, ఉమబోయిన మురళీ, చిక్కాల వీరాస్వామి, బొంగు నాగేంద్ర, అవురి వెంకటేష్, కట్టవ రాజు, సంసాని నాగేశ్వరరావు ఉన్నారు.

'మానవత' సేవలను విస్తృతం చేయాలి

భీమడోలు: స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మానవత అధ్యక్షులు వి.సుగుణాకర్ తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో శనివారం పూళ్ల గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన సేవా కార్యక్రమంలో భాగంగా ఎంఎం పురం గ్రామానికి చెందిన మూడు కుటుంబాల వారికి సహాయాన్ని అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ కష్టంగా ఉన్న కుటుంబాలకు అవసరమైన నిత్యావసర వస్తువులు భీమడోలుకు చెందిన సాయిరాం క్లాత్ స్టోర్స్ వారి సౌజన్యంతో దుస్తులు అందజేశారు. పూళ్ళ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి క్యాన్సర్ వ్యాధి చికిత్స నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ జిల్లా అధ్యక్షులు ఆర్.గంగాధర రావు, డైరెక్టర్ కె.విశ్వేశ్వరరావు, భీమడోలు శాఖ ఛైర్మన్ జి.సూకరాజు పాల్గొన్నారు.

అసంపూర్తిగా 'నాడు-నేడు' పనులు

బుట్టాయగూడెం: మండలంలో వేపులపాడు మండల పరిషత్ పాఠశాల మొదటి ఫేస్‌లో నాడు నేడు అసంపూర్తిగా ఉన్నాయని, అధికారుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరసానిగూడెం సర్పంచి కోరసా గంగారాం, పిడిఎస్‌యు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మోహన్‌లు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాడు నేడు పథకంలో పాఠశాలల్ని బాగు చేస్తున్నట్లు ప్రభుత్వ హామీకి అధికారులు వ్యతిరేకంగా చేస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వేపులపాడు మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మంచినీటి ట్యాంకు, ప్రహరీ గోడ కూడా పూర్తి చెయ్యకుండా ఉందన్నారు. అధికారులు మాత్రం పనులు పూర్తి చేసినట్లు చెబుతున్నారని దీనిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు అన్నారు.

72 మంది రక్తదానం

ఏలూరు అర్బన్: శ్రీరామ్ గ్రూప్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏలూరు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పవర్ పేటలోని స్థానిక ఐడియల్ వారి వీధిలో ఉన్న శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 72 మంది సిబ్బంది రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్.శాంతకుమారి, కడప జిల్లా రిటైర్డ్ జడ్జి సాల్మన్ రాజు హాజరై రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బివి కృష్ణారెడ్డి, డిటిసి శాంతి కుమారి మాట్లాడుతూ శ్రీరామ్ గ్రూప్ దినదినాభివృద్ధి చెందుతూ మరిన్ని సేవా కార్యక్రమాలను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి సాల్మన్ రాజు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్‌లో అరాచకాలు అడ్డుకోవాలి

జంగారెడ్డిగూడెం: మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమాన్ని అరికట్టాలని మహిళలకు రక్షణ కల్పించాలని స్థానిక శ్రామిక మహిళా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం నుండి మసీదు సెంటర్ వరకు శ్రామిక మహిళా కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా కమిటీ పట్టణ కన్వీనర్ ఎస్కె సుభాషిణి మాట్లాడుతూ దేశంలో మతోన్మాద శక్తులు విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయన్నారు.

నేరాలు - ఘోరాలు

బ్యూటీషియన్ అంటూ.. దొంగతనాలకు పాల్పడుతూ..

ఏలూరు స్పోర్ట్స్: ఆమె బంగారంపై ఉన్న మక్కువతో దొంగగా మారింది. తాను బ్యూటీషియన్ అని అందరికీ మెరుగులు దిద్దుతానని తెలిపి ఇళ్లల్లోకి వెళ్లి ఇంటి వివరాలు తెలుసుకొని తర్వాత దొంగతనాలకు పాల్పడుతూ పండరి జ్యోతి పోలీసులకు చిక్కింది. ఏలూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో శనివారం రాత్రి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏలూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రాంతానికి చెందిన పండరి జ్యోతి ప్రజలను మోసం చేస్తూ దొంగతనాలకు పాల్పడుతుండటం తెలిపారు. దీంతో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు రెండో పట్టణ సిఐ చంద్రశేఖర్ బృందాలను ఏర్పాటు చేసి కేసుల దర్యాప్తు ముమ్మరం చేశారు. శనివారం తనిఖీలు చేస్తున్న సమయంలో పోలీసులను జ్యోతి అనుమానాస్పదంగా కనపడటంతో వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 130 గ్రాముల బంగారు ఆభరణాలు, 1/2 కేజీ వెండి, రూ.60 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

జీలుగుమిల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తూ అధిక రేట్లకు అమ్ముతున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్ర శేఖర్ తెలిపారు. శనివారం మండలంలోని కామయ్య పాలెం సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా బొత్తప్ప గూడెం వైపు నుంచి అక్రమంగా రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని ట్రాక్టర్ డ్రైవర్‌లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం

మండవల్లి: మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటనపై మండల పోలీస్ స్టేషన్లో కేసు నమోదైందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు మండలం ఆటపాక గ్రామానికి చెందిన మైనర్ బాలిక మండవల్లి మండలం లేళ్లపూడి గ్రామంలో ఉంటున్న మేనత్త ఇంటికి వచ్చింది. అయితే ఆగస్టు 2న అర్ధరాత్రి సమయంలో లేచి చూడగా బాలిక ఇంటిలో లేకపోవడం గమనించి కంగారుపడుతూ చుట్టుపక్కల సమాచారం చేశారు. దీంతో బాలిక ఆచూకీ పరిశీలించగా పక్క చెరువు మీద ఉంటున్న వసుపల్లి రాజు అనే అతను మైనర్ బాలికను తీసుకొని వెళ్లినట్లు స్నేహితుల ద్వారా తెలుసుకుని పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం, పౌష్టికాహారం అందించే విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడబోదని, అందులో భాగంగా వారి ఇంటికే పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తోందని నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు తెలిపారు. శనివారం స్థానిక నగర పాలకసంస్థ కార్యాలయంలోని పాత కౌన్సిల్‌హాల్లో ఏలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న మహిళా శిశుసంక్షేమ శాఖ ద్వారా గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గం పరిధిలో 205 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణీలు 16,08 మంది, బాలింతలు 12,22 మంది ఉన్నారని, వీరందరికీ వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ద్వారా వైఎస్ఆర్ కిట్లు అందిస్తున్నామన్నారు. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అన్నారు.

జీలుగుమిల్లి: నవజాత శిశువుల, మాతా శిశు మరణాల రేటును తగ్గించడానికి సంపూర్ణ పోషణ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని ఐసిడిఎస్ సిడిపిఒ తులసి తెలిపారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంపూర్ణ పోషణ పథకం కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. బాలింతలు, గర్భిణీలలో రక్తహీనత, పౌష్టికాహార లేమి పూర్తిగా తొలగిపోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పథక కార్యక్రమం చేపడుతోందని పేర్కొన్నారు. అనంతరం పౌష్టికాహార వస్తువులు, పలు పదార్థాలతో కూడిన పోషణ కిట్లను గర్భిణీలు, బాలింతలకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సూపరింటెండంట్ మంగతాయారు, ఎంపిటిసి సున్నం సురేష్, సర్పంచి వనమా రాంబాబు, అంగన్‌వాడీ సూపర్వైజర్ లక్ష్మి దేవమ్మ, కె.రాము, సత్యన్నారాయణ, కె.రాముడు, మండల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జంగారెడ్డిగూడెం ప్రాజెక్ట్ ద్వారకా తిరుమల సెక్టార్ గుండుగోలను కుంట గ్రామంలో తల్లి పాల వారోత్సవాలు శనివారం ఉదయం అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహించారు. తల్లులకు, మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బండారు ధనలక్ష్మి, ఎఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్ ఆషా, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

నరసాపురం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సర్పంచి మోదుగు సునంద అన్నారు. టి.నరసాపురం పంచాయతీలోని గండిగూడెం పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణీలు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్‌లను శనివారం ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లక్ష్మి, ఎంపిటిసిలు నార్లపాటి వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ముదినేపల్లి: తల్లిపాలు అన్నింటికన్నా శ్రేయస్కరమని, పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టించాలని ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ అన్నారు. గ్రామంలో అంబేద్కర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కైకమ్మ, ఎంపిటిసి జంపన కోటయ్య, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న నాయకులు..

సమస్యలు పరిష్కరించాలి

నిడమర్రు: ఎపిటిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని నిడమర్రు మండల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శనివారం సాయంత్రం 4 గంటలకు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు నెలల క్రితం జరిగిన బదిలీలు, ప్రమోషన్స్ పొందిన టీచర్స్ వెంటనే జీతాలు చెల్లించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి రంగవల్లి, మండల అధ్యక్షుడు కొండయ్య, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మల జయ ప్రకాష్ నారాయణ, జిల్లా కౌన్సిల్ మెంబెర్స్ ఐవివిఎస్ ప్రసాద్, కణితి కృష్ణ కుమార్, కాయల లలిత కుమారి, లక్ష్మినారాయణ, సుబ్బరాజు, రాజేశ్వరి పాల్గొన్నారు.

నిర్వాసితులకు కూరగాయలు

జీలుగుమిల్లి: పోలవరం ముంపుకి గురై పునరావాస గ్రామ లలో వుంటున్న నిర్వాసిత కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేసినట్లు తహశీల్దార్ జి.సుందర్ సింగ్ తెలిపారు. మండలం వ్యాప్తంగా మొత్తం 335 కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దర్భగూడెం పంచాయతీలో వేలేరుపాడు మండలం నుంచి వచ్చిన కోయిదా, పుసుగొంది, బొర్రెడ్డిగూడెం గ్రామాలలోని 150 కుటుంబాలకు స్థానిక సర్పంచి సున్నం ఉషారాణి, ఎంపిటిసి సున్నం సురేష్ చేతుల మీదుగా వారికి అందజేశారు.

హర్ ఘర్ జల్ గ్రామాలుగా ఆరుగొలనుపేట, చిత్తపూరు

చాట్రాయి: మండలంలోని ఆరుగొలను పేట, చిత్తపూర్ గ్రామాల్ని హర్ ఘర్ జల్ గ్రామాలుగా గుర్తిస్తూ ఇంటింటికీ కుళాయి ఉన్న గ్రామంగా తీర్చిదిద్దామని సర్పంచి తిరువీధి రమేష్ శనివారం సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ప్రకటించారు. ఈ సమావేశానికి సర్పంచి అధ్యక్షత వహించగా, జల జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్లు సిరిగిరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొని కార్యక్రమాన్ని నడిపించారు. జిల్లా కో కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతీ వ్యక్తికి రోజుకు 55 లీటర్లు చొప్పున శుద్ధి చేయబడ్డ సురక్షితమైన నీరు అందించాలని సూచించారు.

మణిపూర్‌లో ఘటనలు ఖండిస్తూ 8న ర్యాలీ

భీమడోలు: మణిపూర్‌లో జరిగిన మారణ హోమాన్ని ఖండిస్తూ, బాధితులకు అండగా సంఘీభావం తెలిపేందుకు ఈనెల 8న భీమడోలులో నిర్వహించే ఐక్యశాంతి ర్యాలీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక కోరింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కెవిపిఎస్ భీమడోలు మండల కన్వీనర్ టి.సుమన్ బాబు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు ఐక్యశాంతి ర్యాలీ కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి ముళ్ళగిరి జాన్సన్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు మండల ఐక్య క్రైస్తవ వేదిక అధ్యక్ష, కార్యదర్శులు రెవరెండ్ ఫాదర్ బివి రత్నం, ఫాదర్ ఏసయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు వై.ఏడుకొండలు, ఐలూ జిల్లా నాయకులు బి.రాజారావు, రైతు సంఘం జిల్లా నాయకులు కట్టా భాస్కరరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వృత్తిపట్ల అంకితభావంతో ఉండాలి

ఆగిరిపల్లి: వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసే వారికి ఎల్లప్పుడూ ప్రజలల్లో గుర్తింపు లభిస్తుందని ఆగిరిపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు జి.అనూష అన్నారు. ఆగిరిపల్లి ఎంపిడిఒ కార్యాలయం నందు సీనియర్ అసిస్టెంట్‌గా గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్న సిహెచ్.శ్రీను పదోన్నతిలో భాగంగా రెడ్డిగూడెం ఎంపిడిఒ కార్యాలయ ఎఒగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శ్రీను దంపతులను ఎంపిపి దంపతులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.శంకర్రావు, ఎఒ అబ్దుల్ సలాం, ఇవోపిఆర్‌డి బి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు కె.సంగమయ్య, సిహెచ్.పుల్లారావు, ఎం.శ్రీనివాసు, ఎస్‌కె.మీర్జావలీలు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఉద్యోగులు..

10న నులిపురుగుల నివారణ దినోత్సవం

చింతలపూడి: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలో నివారణ మాత్రలు మింగించడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని ఎంపిడిఒ మురళీకృష్ణ తెలిపారు. చింతలపూడి పట్టణంలో ఈనెల 10వ తేదీన ప్రభుత్వం తలపెట్టిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం విజయవంతంగా నిర్వహించాలని మండల సమన్వయ కమిటీ శనివారం నిర్ణయించింది. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎర్రగుంటపల్లి, కె.గోకవరం, రాఘవపురం పిహెచ్‌సిల ఆధ్వర్యంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం డాక్టర్ నరేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు జాతీయ నులుపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రజలకు తెలియ చెప్పాలని పేర్కొన్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో ఐసిడిఎస్ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను ఎంపిపి డాక్టర్ రాంబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేష్, ఐసిడిఎస్ పిఒ మాధవి, ఎంఇఒ జి.రామారావు, ఆరోగ్య విస్తరణ అధికారులు ఎస్‌కె అబ్రార్ హుస్సేన్, పి.శ్రీనివాసరావు, లీల పాల్గొన్నారు.

7న చేనేత దినోత్సవం జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఆగస్టు 7న ప్రపంచ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని చేనేత కేంద్రాలలో చేనేత మగ్గం పతాక ఆవిష్కరణ జరపాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఆర్ఆర్ పేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమగ్ర అభివృద్ధికి చట్టం చేయాలన్నారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని, ప్రభుత్వ శాఖలకు అవసరమైన వస్త్రాలను చేనేత వస్త్రాలని ఉపయోగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న దుస్తులను చేనేత మగ్గాలపై తయారు చేయించి అందించాలని, ఆ రకంగా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని తెలిపారు. చేనేత రంగానికి మరణశాసనమైన జిఎస్‌టిని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు 7 ప్రపంచ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక పతే బాధ, మరకవారి వీధి సెంటర్లో చేనేత మగ్గం పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పతాకావిష్కరణ కార్యక్రమంలో చేనేత కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు చేనేత కార్మికులకు పిలుపునిచ్చారు.

గిరిజనుల అభ్యున్నతికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

కెఆర్.పురం ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా నియమితులైన యం.సూర్య తేజ శనివారం జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ వారిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పరిధిలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చురుకుగా అమలు చేసి, గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఐటిడి ఎపిఒకు సూచించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి వారిని ఐటిడిఎ పిఒ యం.సూర్య తేజ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

బుట్టాయగూడెం: కేర్ పురం ఐటిడిఎ పిఒగా శనివారం ఐఎఎస్ ఎం.సూర్య తేజ ఐటిడిఎ పిఒగా విధులకు హాజరయ్యారు. పిఒగా ఐఎఎస్‌ను నియమించడం పట్ల గిరిజన ప్రజలు ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐటిడిలో ఉన్న పలు సమస్యలు పరిష్కారం అవుతాయని గిరిజనులు ఎదురుచూస్తున్నారు.

పోలవరం: ఐటిడిఎ పిఒగా ఎం.సూర్య తేజ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఐటిడిఎ పిఒ ఎం.సూర్య తేజను పోలవరం మండల తహశీల్దార్ బి.సుమతి, ఎంపిడిఒ జి.శ్రీను మర్యాదపూర్వకంగా కలిసి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఛాంబర్లో పిఒకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

7న చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అధ్యక్షతన నియోజకవర్గ సమన్వయ కమిటీ, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గం పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు, కోళ్ళ నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పారేపల్లి రామారావు, రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి మీడియాతో మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సాగునీటి ప్రాజెక్టులు విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా పోలవరం ప్రాజెక్ట్ సందర్శనకు వస్తున్నారన్నారు. అందులో భాగంగా మొదటగా ప్రాజెక్ట్ సందర్శన చేసి, నిర్మాణ తీరుని పరిశీలించి అనంతరం యామిని కళ్యాణ మండపంలో ప్రాజెక్ట్ నిర్వాసితులు, రైతులతో సమావేశం అవుతారన్నారు. అనంతరం దేవరపల్లిలో పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శీలం వేంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు మొగపర్తి సొంబాబు, మండల పార్టీ అధ్యక్షులు సుంకవల్లి సాయికృష్ణ, ములిశెట్టి నాగేశ్వరరావు, పారేపల్లి నరేష్, బొడ్డు కృష్ణ, ఏలూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ యంత్రప్రగడ శ్రీనివాస్, ఏలూరు జిల్లా తెలుగు రైతు కార్యదర్శి గద్దె అబ్బులు, తెలుగు రైతు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉండవల్లి సోమసుందరం, మాజీ జడ్‌పిటిసి నల్లురి వెంకట చలపతిరావు, కాల్నిడి రాంబాబు, పరిమి రాంబాబు, ఎంపిటిసి షేక్ బాజీ, ఎస్‌టి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోట్టా రామారావు, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి మొడియం సింగరాజు, కొయ్యలగూడెం టౌన్ పార్టీ అధ్యక్షులు జ్యేష్ఠ రామకష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల సూచనలతో నాణ్యమైన దిగుబడులు

ప్రజాశక్తి - భీమడోలు

రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి నాణ్యమైన దిగుబడులను ఎక్కువ మొత్తంలో సాధించాలని ఏలూరు ఏరువాక వ్యవసాయ కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఫణి కుమార్, సమన్వయకర్త టి.సుజాత కోరారు. శనివారం వారు భీమడోలు వ్యవసాయాధికారి ఎస్‌పివి ఉషారాణి ఆధ్వర్యంలో మండలంలో వివిధ రకాల తెగుళ్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న, ముంపుకు గురైన వరి, వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమడోలు పరిధిలోని వ్యవసాయ క్షేత్రాల్లో వరి పైరుకు ఎండకు తెగులు సోకిందన్నారు. దీని నివారణకు ప్రస్తుతం సదరు వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న పాత నీరును తీసివేసి, కొత్తనీటితో రెండు, మూడు పర్యాయాలు నింపాలని కోరారు. కాపర్ హైడ్రాక్సైడ్, ప్లాంటామైసిన్ మందుల మిశ్రమాన్ని పిచికారీ చేయటం ద్వారా ఎండకు తెగులు ఉధృతిని అదుపు చేయవచ్చునన్నారు. అనంతరం మండలంలోని ఇటీవల కురిసిన వర్షాలకు ముంపుకు గురైన వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు గ్రామ సచివాలయాల వ్యవసాయ సహాయకులు రూపా దేవి, రామలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

చింతలపూడి: నల్లముట్టే పురుగు ఆశించిన ఆకులు ఎండిపోయి, తోటంతా కాలిపోయినట్లు కనిపిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. దీని నివారణకు చిన్న దశ గొంగళి పురుగు ఉన్నపుడు బ్రాకాన్ బ్రేవి కార్నిస్ బదానిక (ఒక చెట్టుకి ఇరవై మిత్ర పురుగులు), పెద్ద దశ గొంగళి పురుగు ఉన్నపుడు గోని యోజేస్ నెఫాంటిడిస్ బదానిక(ఒక చెట్టుకి ఇరవై మిత్ర పురుగులు), ఎకరానికి పది శాతం మొక్కలకు విడుదల చేయాలని రైతులకు కొబ్బరి పరిశోధన సంస్థ అంబాజీపేట నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు డా.వి.అనూష, డా.వి.గోవర్ధన్ రావులు, ఏలూరు ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.శాంతి సూచించారు. అల్లిపల్లిలో ఉన్న కొబ్బరి తోటలను మండల ఉద్యాన శాఖాధికారిణీ ఎండి షాఫీయా ఫర్వీన్‌లతో కలిసి సందర్శించారు. అనంతరం కొబ్బరి తోటలను గమనించి రైతులకు సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండు తెగులు సోకిన ఆకులు చివరి నుంచి ఎండిపోవడం మొదలవుతుందని, క్రమంగా ఆకు మొత్తం ఎండిపోయినట్లు అవుతుందన్నారు. దీని నివారణకు ఎండిన ఆకులు కాల్చి వేయాలని సూచించారు. అంతేగాక రెండు ఎంఎల్ హెక్సాకొనిజోల్ వెయ్యి ఎంఎల్ నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

న్యూయార్క్ సమావేశాలకు మండవల్లి విద్యార్థి

మండవల్లి: న్యూయార్క్‌లో నిర్వహిస్తున్న సమావేశాలకు మండవల్లి పాఠశాలకు చెందిన యువ సాయి ప్రదీప్ ఎంపిక కావడం అభినందనీయమని సర్పంచి మండల్ ఝాన్సీ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సిహెచ్ యువసాయి ప్రదీప్ 2022-23 విద్యా సంవత్సరం నిర్వహించిన పదవ తరగతి పరీక్షల్లో 600 మార్కులు గాను 585 మార్కులు సాధించాడని అన్నారు. యునైటెడ్ నేషన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో న్యూయార్క్‌లో నిర్వహించే సమావేశాలకు పాల్గొనే విధంగా రాష్ట్రస్థాయిలో 10వ తరగతి పరీక్షలలో అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థులు 10 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. వారిలో యువసాయి ప్రదీప్ కూడా ఉండడం గర్వకారణమన్నారు.

భార్య, ప్రియుడే చంపేశారు..

ఉంగుటూరు: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్న భర్తను అతని భార్య, ప్రియుడుతో కలిసి పథకం ప్రకారం హత్య చేసిన కేసులో పోలీసులు 24 గంటల్లోపే ఛేధించి ముద్దాయిలను అరెస్టు చేశారు. శనివారం ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు ఏలూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసుకు సంబంధించి అరెస్టు వివరాలను వెల్లడించారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కోటాల గ్రామానికి చెందిన కురిపాటి చంద్రశేఖర్(39)కు అదే గ్రామానికి చెందిన కురిపాటి భువనేశ్వరితో 11 సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. చంద్రశేఖర్ ఉంగుటూరు మండలం నారాయణపురంలో టైల్స్ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో స్థానికంగా అద్దెకు ఉంటున్నారు. ఈక్రమంలో చంద్రశేఖర్ కుటుంబం నివాసముంటున్న ఇంటి పక్కన తాపీ పనికి వచ్చిన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన గొర్ల సూర్యనారాయణ అనే యువకునితో భువనేశ్వరికి పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈనేపథ్యంలో తరచూ భర్తతో భార్య గొడవలు పడేది. దీంతో ఎలాగైన చంద్రశేఖర్ అడ్డు తొలగించుకోవాలని భార్య భువనేశ్వరి, ప్రియుడు సూర్యనారాయణ పథకం వేసి గురువారం రాత్రి చంద్రశేఖర్ నిద్రిస్తున్న సమయంలో వెంట తెచ్చుకున్న చాకుతో మృతుడిని సూర్యనారాయణ విచక్షణారహితంగా పీకమీద, మెడమీద కోయడంతో అక్కడికక్కడే మరణించాడు. వీరిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి శ్రీనివాసులు వెల్లడించారు. హత్య జరిగిన 24 గంటల్లోనే ముద్దాయిలను పట్టుకున్న నిడమర్రు సిఐ ఎంవి.సుభాష్, చేబ్రోలు, నిడమర్రు ఎస్‌ఐలు కె.స్వామి, ఆర్.శ్రీను, సిబ్బందిని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.


భవిష్యత్‌కు గ్యారంటీలో టిడిపి నేతలు..

జగన్ హయాంలో కుంటుపడిన అభివృద్ధి : టిడిపి

ముసునూరు: జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో గ్రామ పంచాయతీల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని నూజివీడు నియోజక వర్గ టిడిపి ఇంఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని అక్కిరెడ్డి గూడెంలో సర్పంచి పులిబళ్ల లక్ష్మి సత్యనారాయణ, పెదబాబుల ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ముద్దరబోయిన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘుబాబు, సర్పంచి పులిబళ్ల లక్ష్మి సత్యనారాయణ, బర్మా శ్రీనివాసరావు, కందుల పిచ్చియ్య, నామా సత్యనారాయణ, పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ

జంగారెడ్డిగూడెం: ఎన్నో విజయవంతమైన, సందేశాత్మక చిత్రాలలో నటించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నటుడు సూపర్ స్టార్ కృష్ణ అని జంగారెడ్డిగూడెం మహేష్ యువసేన అధ్యక్షులు భవిరిశెట్టి మురళీకృష్ణ అన్నారు. శనివారం గుంటూరు జిల్లా తెనాలి మండలంలోని సూపర్‌స్టార్ కృష్ణ స్వగ్రామం బుర్రిపాలెంలో అభిమానులు ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహ ఆవిష్కరణకు ఎంకెఎంవై అధ్యక్షులు మురళీకృష్ణ, జంగారెడ్డిగూడెం అభిమానులతో ఆవిష్కరణలో పాల్గొన్నారు.

కోర్టు ఉద్యోగికి సన్మానం

నూజివీడు రూరల్: పట్టణంలోని స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు ఉద్యోగి జి.నాగరాజు బదిలీ అయిన సందర్భంగా కోర్టు హాలులో శనివారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి, నాగరాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసినప్పుడే ప్రజలకు ఉత్తమ సేవలు అందుతాయన్నారు.

గ్రామసభల్లో ప్రజలు పాల్గొనాలి

మండవల్లి: గ్రామ సభల్లో ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొని గ్రామాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలను చేయగలిగినప్పుడే గ్రామ అభివృద్ధి సాధ్యపడుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కరరావు స్పష్టం చేశారు. మండలంలోని గన్నవరం గ్రామంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహణపై గ్రామస్తులకు శనివారం అవగాహన కలిగించారు.

భూములు ఆన్‌లైన్ చేయాలని వినతి

టి.నరసాపురం: మండలంలోని అల్లంచర్లరాజుపాలెంలో రైతులకు పట్టాలు ఇచ్చిన భూములకు ఆన్‌లైన్ చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన రైతులు శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లంచర్ల రాజుపాలెం గ్రామంలో 2005లో 160 మంది రైతులకు ఒక్కొక్కరికి 50 సెంట్లు చొప్పున పట్టాలు ఇచ్చారని తెలిపారు. వారిలో కొందరికి ఆన్‌లైన్ చేసి, మిగిలిన వారికి చేయక పోవడంతో రైతు భరోసాతో పాటు ప్రభుత్వం అందించే రాయితీలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మిగిలిన భూములకు సబ్ డివిజన్ చేసి ఆన్‌లైన్ చేయాలని వారు కోరారు.

8న కొబ్బరి రైతుల జిల్లా సదస్సు

పెదవేగి: కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం కార్యదర్శి బొల్లి రామకృష్ణ, ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల ఎనిమిదో తేదీన విజయరాయిలోని ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం యార్డు ఆవరణలో జరుగుతున్న కొబ్బరి రైతుల జిల్లా సదస్సు కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయరాయి గాంధీనగర్‌లోని ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం యార్డు ఆవరణలో జరుగుతున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సదస్సులో కొబ్బరి రైతుల భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జి.రమేష్‌రెడ్డి, భీమవరపు రామిరెడ్డి, కళ్లెం శివారెడ్డి, బొప్పన వీర వెంకట సుబ్బారావు, వట్టికూటి రామావతారం, కొబ్బరి రైతులు పాల్గొన్నారు.